సాక్షి
ఖమ్మం

బుధవారం । 8 । మే । 2024



సంభానీ.. పీఛేముడ్!

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా ఆ పార్టీ శ్రేణుల నుంచి నిరసన ఎదురవుతోంది.

IIలో



మోదీ గెలిస్తే రిజర్వేషన్లు మాయం

మరోమారు మోదీ గెలిస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మల్లేశ్వర్ తెలిపారు.

IIలో

గరిష్టం / కనిష్టం
38° / 29°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత కాస్త తక్కువగానే నమోదవుతుంది. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

సత్వరన్యాయం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: కక్షిదారులకు సత్వరన్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుంత రాజగోపాల్ వెల్లడించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాలపై నమ్మకంతో కక్షిదారులు వస్తారని, వారికి సత్వరన్యాయం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. లోక్‌అదాలత్‌ను వినియోగించుకుంటే సత్వర న్యాయం అందడమే కాక సమయం, డబ్బు ఆదా అవుతాయనే అంశంపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కల్పనను బార్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఉమాదేవి, అపర్ణ, దీప, రజని, బిందుప్రియ, మాధవి, న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, వెంకట్, యుగంధర్, గోపి, శ్రీను, లలిత పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో వైద్యుల ధర్నా



నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై దాడికి నిరసనగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది మంగళవారం ధర్నా నిర్వహించారు. కొద్దిసేపు విధులు నిలిపేసి ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిపై దాడి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు బి.కిరణ్‌కుమార్, సదానందం, బాబురత్నాకర్, సరిత, తులసి, రమేష్, రాంప్రసాద్, అశోక్, విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఈఏపీ సెట్



ఖమ్మం ఎస్‌బీఐటీలో విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న టీఎస్ ఈఏపీ సెట్ మంగళవారం జిల్లాలో ప్రారంభమైంది. ఖమ్మం, సత్తుపల్లిల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఖమ్మంలోని కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 1,563మందిలో 1,454మంది, మధ్యాహ్నం పరీక్షకు 1,564మందిలో 1,492 మంది హాజరయ్యారు. అలాగే, సత్తుపల్లిలో ఉదయం పరీక్షకు 410మందికి 375మంది, మధ్యాహ్నం పరీక్షకు 411మందిలో 372మంది హాజరయ్యారని అధికార యంత్రాంగం వెల్లడించింది.

తాగునీటి సమస్య రావొద్దు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన జిల్లాలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా చూస్తూనే నాణ్యతపై శ్రద్ధ కనబర్చాలని సూచించారు. తాగునీటి వనరులు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడమే కాక కొత్త కాలనీలకు లైన్లు వేసి కనెక్షన్లు ఇవ్వాలని తెలిపారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మిషన్ భగీరథ ఎస్‌ఈ సదాశివ కుమార్, జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ హరికిషన్, ఈఈలు రంజిత్, కృష్ణలాల్, పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

పూడిక మట్టిని సద్వినియోగం చేసుకోండి

చెరువుల్లో పూడిక తీస్తున్నందున మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. ఉపాధిహామీ కింద చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని, చిన్న, సన్నకారు రైతులు సంబంధిత ఎంపీడీఓలు, అదనపు ప్రోగ్రాం అధికారులను సంప్రదించి ట్రాక్టర్ రవాణా ఖర్చు భరిస్తే ఉచితంగా పూడిక మట్టిని పొలాలకు తరలించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 3,820 మంది రైతులు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ మట్టితో భూసారం, దిగుబడులు పెరగడమే కాక సాగు ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ తెలిపారు.

సమయం లేదు మిత్రమా..

ముగింపు దశకు లోక్‌సభ ఎన్నికల ప్రచారం

- పట్టణాలు, మండల కేంద్రాల్లో విస్తృతంగా రోడ్డు షోలు
- ఓటర్లను ఆకర్షించే పనిలో రాజకీయ పార్టీలు
- ఆఖరి ప్రచారం... పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి



ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి రోడ్డుషోకు హాజరైన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం ముగింపు దశకు చేరుతోంది. ఈనెల 11న సాయంత్రం ఆరు గంటల వరకు ప్రచారానికి అవకాశముండగా.. మిగిలిన తక్కువ సమయంలో ముఖ్యనేతలను రప్పించి పట్టణాలు, మండల కేంద్రాల్లో రోడ్డు షోలు నిర్వహించేలా పార్టీలు ప్రణాళిక రూపొందించాయి. ఆఖరు ప్రచారంలో ఓటర్లను ఆకట్టుకునేలా సుడిగాలి పర్యటనలకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులకు సంబంధించి ముఖ్య నేతల పర్యటనలు ఇప్పటికే ముగిశాయి. ఇక ఈ నాలుగు రోజుల్లో కొందరు నేతలను రప్పించి ప్రచారం హోరెత్తించడంపై దృష్టి సారించారు.

హోరాహోరీగా..

ఖమ్మం లోక్‌సభ బరిలో 35మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గత నెల 18నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగగా.. ఈనెల 13న పోలింగ్ జరగనుంది. అయితే, నామినేషన్లకు ముందే బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులుగా నామా నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావును ప్రకటించారు. ఆతర్వాత కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని బరిలోకి దింపింది. ఆర్భాటం లేకుండా నామినేషన్లు వేసిన అభ్యర్థులు ప్రచారం మాత్రం హోరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన ఆలస్యం కావడంతో తొలుత ఎన్నికల జోష్ రాలేదు. రఘురాంరెడ్డిని ప్రకటించాక కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ ప్రచారాన్ని కదం తొక్కించాయి. పోటాపోటీగా నియోజకవర్గ, పార్లమెంట్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించడమే కాక అభ్యర్థులు, నేతలు పల్లెలు, పట్టణాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఇకపై ఇంటింటికీ...

ఓటర్లను ఆకర్షించే పనిలో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇన్నాళ్లు రోడ్డు షోలు, సభలకే పరిమితం కాగా ప్రస్తుతం ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టాయి. ఖమ్మం కార్పొరేషన్, మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల తరఫున నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, పోస్టర్లు ఇస్తూ తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బూత్ కమిటీలు ఈ ప్రచారాన్ని కీలకంగా తీసుకున్నాయి. ప్రచార గడువు ముగిసే వరకు ఈ ప్రక్రియ కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి..

హంగూ ఆర్భాటాలతో ప్రచారం చేసినా చివరకు పోల్ మేనేజ్‌మెంట్ చేయకపోతే విజయావకాశాలు సన్నగిల్లుతాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. దీంతో కోలాహలంగా ప్రచారం చేయిస్తున్న అభ్యర్థులు మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పైనా దృష్టి సారించారు. గత రెండు, మూడు ఎన్నికల్లో తమ పార్టీకి పోల్ అయిన ఓట్లు ఎన్ని, అప్పుడు ఏ ప్రాంతాల్లో తగ్గాయో బేరీజు వేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో ఓటర్లను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పార్టీల వారీ ఓట్లతో పాటు కులాల వారీగా ప్రతీ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు ఉన్నాయో లెక్కలు తీశారు. వీటి ఆధారంగా పోల్ మేనేజ్‌మెంట్ ఎక్కడ ఎలా చేస్తే గెలుస్తామనే అంశంపై కసరత్తు చేపట్టి.. చివరి అంశం విజయవంతం పూర్తిచేసేందుకు సిద్ధమవుతున్నారు.

అతిరథులతో ప్రచా'రణం'

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు తరఫున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రచారానికి వచ్చారు. అలాగే, బస్తర్ రాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ సైతం ఖమ్మంలో ప్రచారానికి హాజరయ్యారు. ఇక బీఆర్‌ఎస్‌కు సంబంధించిన నామ నాగేశ్వరరావు కోసం మాజీ సీఎం కేసీఆర్ ఖమ్మం, కొత్తగూడెంలో రోడ్డు షో చేశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రచారానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సైతం హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. మరోపక్క కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి మద్దతుగా సినీ హీరో వెంకటేష్ మంగళవారం ఖమ్మం, కొత్తగూడెంలో ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అన్ని పార్టీలూ ముఖ్య నేతలను రప్పించి పోటాపోటీగా ప్రచారం చేస్తుండడంతో ప్రసంగాల మోత మోగుతోంది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

పట్టభద్రుల స్థానానికి 14 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి, ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ మధు తదితరులు

నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ నుంచి ఈడ శేషగిరిరావు, శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్, యువతరం పార్టీ నుంచి బండారు నాగరాజు నామినేషన్లు సమర్పించారు. అలాగే, స్వతంత్రులుగా అయితగోని రాఘవేంద్ర, పిడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, మారం వెంకట్‌రెడ్డి, గుగులోతు బీమా, డాక్టర్ పెంచాల శ్రీనివాస్, కంటే సాయన్న, దైద సోమసుందరం, అల్వాల కనకరాజు నామినేషన్ వేశారు. అభ్యర్థుల నుంచి ములుగు జిల్లా అదనపు కలెక్టర్, పట్టభద్రుల నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్.మహేందర్‌జీ నామినేషన్లు స్వీకరించారు.

ఓటు వేసిన 8,201 మంది

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ఉద్యోగులు, వయోవృద్ధులు, దివ్యాంగులు మంగళవారం నాటికి 8,201 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 5,636మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా, 85ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు 2,565మంది ఓటు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, మంగళవారం పోస్టల్ బ్యాలెట్లు 2,003మంది, దివ్యాంగులు, వృద్ధులు 2,565మంది ఓటు వేశారని వెల్లడించారు.

మూడు రోజుల్లోగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్



ఉచిత రవాణా స్టిక్కర్లను చూపిస్తున్న ఆర్‌ఓ, కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యాన ఈనెల 10వ తేదీలోగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన పూర్తికావాలని ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కేంద్రాల్లో ఈనెల 10వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని తెలిపారు. జిల్లాలోని 438 పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు రూ.13.50 కోట్ల నిధులు మంజూరు చేశామని, ఒక్కో పాఠశాలకు రూ.25వేల నుండి రూ. 50వేల అడ్వాన్స్ ఇవ్వగా.. ఎంపీడీఓలకు రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించామని చెప్పారు. ఈ నిధులతో టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులు, లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు, నీటి వసతి కల్పన తదితర పనులు చేపట్టాలని సూచించారు. ఎండల దృష్ట్యా టెంట్లు, చల్లటి తాగునీరు సమకూర్చడమేకాక పోలింగ్ రోజున వయోవృద్ధులు, దివ్యాంగుల రవాణాకు వాహనాలు ఏర్పాటు చేస్తున్న అంశంపై ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. కాగా, పోస్టల్ బ్యాలెట్లు అందుకున్న ఉద్యోగుల జాబితాను కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డీఈఓ సోమశేఖరశర్మ, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఓ హరికిషన్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఉద్యోగులు అరుణ, సంపత్ పాల్గొన్నారు.

గుర్తుందా.. సింగిల్ 'హ్యాండ్'!



అభివాదం చేస్తున్న హీరో వెంకటేష్, పక్కన మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

- సేవాభావం కలిగిన రఘురాంరెడ్డిని గెలిపిస్తే మేలు
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారంలో సినీ హీరో వెంకటేష్
- ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎంపీ రేణుకా చౌదరి

ఖమ్మం వన్‌టౌన్: 'అందరికీ గుర్తుందా.. చేయి గుర్తు.. సేవాభావం కలిగిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించుకుంటే ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడమే కాక అభివృద్ధికి పాటుపడతారని ఆయన వియ్యంకుడు, సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ తెలిపారు. రఘురాంరెడ్డి తరఫున మంగళవారం ఖమ్మంలో నిర్వహించిన రోడ్డుషోలో ఆయన పాల్గొన్నారు. సాయంత్రం 6గంటలకు మయూరిసెంటర్ వద్ద ప్రారంభమైన రోడ్డుషో పాత ఎల్‌ఐసీ ఆఫీస్, జెడ్పీ సెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి, ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు కొనసాగింది. మార్గమధ్యలో జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో వెంకటేష్ మాట్లాడుతూ అందరూ ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలని సూచించారు. 'ఎనీటైం... ఎనీ సెంటర్.. సింగిల్ హ్యాండ్ రఘురాంరెడ్డి.. కమాన్ ఖమ్మం' అంటూ తన సినిమాల్లోని డైలాగ్‌లతో వెంకటేష్ ఆకట్టుకోగా ఆయనను చూసేందుకు రహదారి పొడవునా జనం బారులు దీరారు. అలాగే, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ శ్రేణులు సైతం భారీగా తరలివచ్చాయి అనంతరం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడగా ఎంపీ రేణుకాచౌదరి, అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో పాటు తుమ్మల యుగంధర్, బాలసాని లక్ష్మీనారాయణ, మహ్మద్ జావీద్, కమర్తపు మురళి, పాలెపు విజయలక్ష్మి, రావర్తి శరత్, దొబ్బల సౌజన్య, విజయాబాయి, నాగండ్ల దీపక్‌చౌదరి, తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- కోత దశలో ఉన్న మామిడి, ఇతర పంటలకు నష్టం
- పలుప్రాంతాల్లో వర్షంతో వాతావరణంలో మార్పు



పెనుబల్లి మండలం బ్రహ్మళకుంటలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: ప్రకృతి బీభత్సం వెంటాడుతోంది. శనివారం నుంచి ప్రతిరోజు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో అకాల వర్షాలు, వడగళ్ల వాన కురుస్తున్నాయి. ఈ కారణంగా చేతికందే దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లుతోంది. పలుచోట్ల ఇళ్ల కప్పులు లేచిపోవడమే కాక విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలడంతో ఆస్తి నష్టం జరుగుతోంది. శని, ఆదివారం వీచిన ఈదురుగాలుల కారణంగా విద్యుత్ శాఖకు రూ.20 లక్షల నష్టం జరిగినట్లు అంచనా. ఇంతలోనే మంగళవారం మధ్యాహ్నం పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మరో 309స్తంభాలు, తొమ్మిది ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులు, అకాల వర్షానికి అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఉద్యోగులు పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, తెగిపడిన తీగలను తాకొద్దని, పశువులకు మేతకు వదలొద్దని ఈ సందర్భంగా ఎస్‌ఈ ఏ.సురేందర్ సూచించారు. ఎక్కడైనా సమస్య ఉంటే 94408 11525 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

మామిడికి తీరని నష్టం

జిల్లాలో కోత దశలో ఉన్న మామిడి పంట ఈదురు గాలులకు నేలరాలిపోతోంది. అలాగే, జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు కోత దశలో ఉండగా దెబ్బతింటున్నాయి. ప్రధానంగా మామిడి కాయలు నేల రాలుతుండడంతో నాణ్యత దెబ్బతిని ధర తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలకు దాదాపు 250 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ఇక కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు.

వాతావరణంలో మార్పు

రానున్న మరో నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో మధ్యాహ్నం వరకు జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమో దు కాగా.. సాయంత్రం తర్వాత వర్షంతో వాతావరణం చల్లబడింది. ఫలితంగా ఉక్కపోతతో సతమతమవుతున్న జనం ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో రాత్రి 8 గంటల సమయానికి వేంసూరు మండలంలో అత్యధికంగా 24.3 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా.. ఎర్రుపాలెం, సత్తుపల్లి మండలం సదాశివునిపేట, పెనుబల్లి, గౌరారం, మధిర, ఏన్కూరు, కామేపల్లి మండలం లింగాల, పగిడి, బచ్చోడు, ఖమ్మం, చింతకాని, తల్లాడ, వైరా, కల్లూరులో కూడా వర్షపాతం నమోదైంది.

మరోమారు ప్రధాని మోదీనే...

- బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- బస్తర్ మహరాజు, కాకతీయుల వంశ వారసుడు కమల్‌చంద్ర



వైరాలో డప్పు వాయిస్తున్న అభ్యర్థి వినోద్‌రావు, పక్కన కమల్‌చంద్ర భంజ్‌దేవ్ తదితరులు

వైరా/ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో మరోమారు బీజేపీ అధికారంలోకి రావడం.. మోదీ ప్రధాని కావడం ఖాయమని బస్తర్ మహరాజు, కాకతీయుల వంశ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ స్పష్టం చేశారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున వైరాలో నిర్వహించిన ప్రచార ర్యాలీ తో పాటు ఖమ్మంలో నిర్వహించిన కమ్మ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొనగా.. బీజేపీ, టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. వైరాలో నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, అభ్యర్థి వినోద్‌రావుతో కలిసి పాల్గొన్న కమల్‌చంద్ర మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి రానున్న నేపథ్యాన ఖమ్మంలోనూ వినోద్‌రావును గెలిపిస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.12 వేల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి చేసిన ఘనత మోడీదేనని తెలిపారు. అనంతరం అభ్యర్థి వినోద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీలను ప్రజలు నమ్మకపోవడంతో ఈ ఎన్నికల్లో మాయ చేసేందుకు రిజర్వేషన్ల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తనను గెలిపిస్తే పామాయిల్ బోర్డు సాధించడంతో పాటు సింగరేణి గనుల అనుమతులు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి పాటుపడతానని తెలిపారు. అనంతరం వైరా శాస్తానగర్‌లోని అయ్యప్ప స్వామి క్షేత్రంలో పూజలు చేశారు. ఇక ఖమ్మంలో నిర్వహించిన కమ్మ ఆత్మీయ సమ్మేళనంలో కూడా బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు, బస్తర్ మహరాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ పాల్గొనగా... బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ప్రకటించారు. ఈసమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీతో పాటు వివిధ పార్టీల నాయకులు సున్నా రవికుమార్, శ్యాం రాథోడ్, కోటేశ్వరరావు, రంగా కిరణ్, భద్రయ్య, వెంకటకృష్ణ, హరీశ్‌చంద్ర, వరలక్ష్మి, కళ్యాణం లక్ష్మీపతి, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు గుత్తా సీతయ్య సున్నా నవీన్, పృథ్వీ, లక్ష్మణ్, చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పెట్టుబడి సాయం

- డిసెంబర్ నుంచి అంచెలంచెలుగా పథకం అమలు
- మార్చి నాటికి ఐదెకరాల వరకు పూర్తి
- ప్రస్తుతం ఆపై భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నగదు



ఖమ్మంవ్యవసాయం: యాసంగి సీజన్ ప్రభుత్వ పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. మార్చి నుంచి నిలిచిపోయిన రైతుబంధు నగదు జమ ప్రక్రియ మళ్లీ సోమవారం ప్రారంభమైంది. 2018 నుంచి ఏటా రెండు సీజన్లలో ఎకరాకు రూ.5వేల చొప్పున పంటల పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతులకు అందిస్తోంది. గడిచిన యాసంగి సీజన్‌లో గత ప్రభుత్వం సకాలంలో రైతుబంధు పథకాన్ని సకాలంలో అమలు చేయకపోగా, ఆతర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పథకాన్ని రైతుభరోసాగా కొనసాగిస్తామని వెల్లడించింది. ఈ మేరకు జిల్లాలో పథకానికి 3,42,799 మంది అర్హులు కాగా వీరి భూమి ఆధారంగా ప్రభుత్వం రూ. 360.30 కోట్లు గతంలోనే కేటాయించారు.

ఆరు నెలలుగా అంచెలంచెలుగా..

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. గత ప్రభుత్వం అమలు చేసినట్లుగానే యాసంగి పెట్టుబడి సాయం పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. డిసెంబర్ 12వ తేదీ నుంచి తక్కువ భూమి కలిగిన రైతులకు ప్రాధాన్యం ఇస్తూ నగదు జమ చేస్తుండగా ఆ నెలలో రెండెకరాల లోపు భూమి ఉన్న రైతులు 1.60 లక్షల మంది ఖాతాల్లో రూ. 62.63 కోట్లు జమ అయ్యాయి. జనవరి, ఫిబ్రవరిల్లో పథకం నత్తనడకన సాగగా, ఐదెకరాల లోపు భూమి కలిగిన రైతులకు మాత్రమే రైతుభరోసా అమలవుతుందనే ప్రచారం జరిగింది. ఇంతలోనే మార్చిలో ఐదెకరాల భూమి కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు మూడు నుంచి ఐదెకరాల భూమి కలిగిన సుమారు 1.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 191.74 కోట్లు జమ చేశారు. అప్పటివరకు మొత్తంగా 3,07,327 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 254.37 కోట్లు జమ కాగా.. అంతకుమించి భూమి కలిగిన రైతులకు రైతుభరోసా జమ కాదనే చర్చ సాగింది. ఇంతలోనే లోక్‌సభ ఎన్నికలు రావడం.. పెట్టుబడి సాయం అంశాన్ని ప్రతిపక్షాలు ప్రచారాస్త్రంగా తీసుకోవడంతో ప్రభుత్వం మళ్లీ రైతు భరోసా కింద నగదు జమ చేయడం మొదలు పెట్టింది.

ఇప్పుడు వారికి కూడా...

లోక్‌సభ ఎన్నికలో లేదంటే ప్రతిపక్షాల విమర్శలో కారణం తెలియకున్నా ఐదెకరాల పైబడి భూమి కలిగిన రైతులకు యాసంగి సీజన్ పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోంది. ఈ కేటగిరీ రైతులు జిల్లాలో 35 వేల మంది వరకు ఉంటారని అంచనా. వీరికి ఉన్న భూమి ఆధారంగా ప్రభుత్వం రూ.116 కోట్లను జమ చేస్తోంది. ఇదిలా ఉండగా ఎకరాకు రెండు సీజన్లలో కలిపి రూ.15 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయాన ప్రకటించిన నేపథ్యాన వచ్చే ఖరీఫ్ నుంచి అమలయ్యే అవకాశముంది. అయితే, రైతులందరికీ కాకుండా ఐదు లేదా పది ఎకరాల భూమి స్లాబ్‌గా పథకం వర్తింపచేయనున్నట్లు చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

ప్రజలకు భరోసా కల్పించడమే లక్ష్యం

పోలీసు కమిషనర్ సునీల్‌దత్



తిరుమలాయపాలెం : సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

తిరుమలాయపాలెం/కూసుమంచి: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం ద్వారా భరోసా కల్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణే కీలకంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించొద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా వేయాలని ఆదేశించారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు క్రాస్, కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను సీపీ పరిశీలించి వాహన తనిఖీలు, ఇతర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

మధిర: విద్యుత్ సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్ సూచించారు. మధిర సబ్ డివిజన్ ఏడీఈ అనురాధ ఆధ్వర్యాన మధిరలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు విధులు నిర్వర్తించే సమయాన సంస్థ అందించే భద్రత పరికరాలను వినియోగిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం పలువురు ఉద్యోగులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.డీఈ ఎస్.కృష్ణ, ఏఈలు అనిల్ కుమార్, నాగేశ్వరరావు, అనూష, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి ముగ్గురికి గాయాలు



గోడ కూలడంతో మంచంపై పడిన ఇటుకలు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటి గోడ కూలడంతో ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం తెల్లవారుజామున ఖమ్మంలోని రామచంద్రయ్యనగర్‌లో చోటు చేసుకుంది. అంతా గాఢనిద్రలో ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరగగా ముగ్గురూ గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. రామచంద్రయ్యనగర్‌లో గండు నవీన్ రేకులతో నిర్మించుకున్న ఇంట్లో నివసిస్తున్నాడు. గాలిదుమారంతో మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయాన గోడ కూలగా నిద్రలో ఉన్న నవీన్, ఆయన పిల్లలు వైశాలి, లిఖిత్‌పై ఇటుకలు పడ్డాయి. పిల్లలకు తీవ్ర గాయాలు కాగా, నవీన్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీంతో స్థానిక కార్పొరేటర్ బిక్కసాని ప్రశాంతలక్ష్మి, ఆమె భర్త జశ్వంత్ చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

బెల్ట్‌షాపుల్లో మద్యం స్వాధీనం

ముదిగొండ: మండలంలోని వల్లాపురం, బాణాపురం గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపుల్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బాణాపురంలో 53, వల్లాపురంలో 68మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో ఆర్‌ఎస్‌ఐ మరళి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేట నందమూరి నగర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి సోమవారం ఉదయం సత్తుపల్లిలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. యువతి కుటుంబీకులు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. యువతి తల్లి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,750
పెసలు	7,770	4,000
కందులు	11,102	9,000
మినుములు	8,100	8,100
అలసంద	7,900	7,900
మిర్చి	18,000	10,500
తాలు మిర్చి	10,000	5,300
పత్తి	7,125	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,229



కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి తరఫున ప్రచారంలో ఆయన పెద్ద కోడలు అశ్రిత, చిన్నకుమారుడు - కోడలు అర్జున్‌రెడ్డి, సప్నిరెడ్డి



బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తరఫున ప్రచారంలో కుమారులు పృథ్వీతేజ, భవ్యతేజ, సాయిరాం

సకుటుంబ సపరివార సమేతం

- ఎండను లెక్కచేయకుండా అభ్యర్థుల కుటుంబీకుల ప్రచారం
- బిజీబిజీగా నేతల కుటుంబ సభ్యులు
- గెలుపే లక్ష్యంగా సుడిగాలి పర్యటనలు
- కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారంలో సినీ హీరో వెంకటేష్



బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు తరఫున ప్రచారంలో ఆయన సతీమణి వినీల

ఖమ్మంవన్‌టౌన్: భరించలేనంత ఎండ.. 45 డిగ్రీలు దాటుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల కుటుంబీకులు సైతం రంగంలోకి దిగారు. ప్రచార గడువు సమీపిస్తుండటంతో నిప్పుల కొలిమిలా ఉన్న వాతావరణాన్ని భరిస్తూ ప్రచారంలో పాల్గొంటున్నారు. తమ వారిని గెలిపించుకుని ఆ ఆనందాన్ని కళ్లారా చూసేందుకు గ్రామాలు, పట్టణాలను చుట్టేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రధాన పార్టీల అభ్యర్థుల సతీమణులు, కుమారులు, కోడళ్లు, వియ్యంకులు ఇలా సకుటుంబ సపరివార సమేతంగా ప్రచారం నిర్వహిస్తుండటం విశేషం.

బిజీబిజీగా..

లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికల్లో తమ వారిని గెలుపించుకునేందుకు నేతల కుటుంబ సభ్యులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఎక్కడో హైదరాబాద్‌లో ఉంటూ తమ వ్యాపారాలను చూసుకునేవారు సైతం ఇక్కడే మకాంవేసి ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి తరఫున ఆయన వియ్యంకుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గెలుపు బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని పర్యటిస్తున్నారు. ఇక మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి సైతం ప్రచార రంగంలోకి దిగారు. అలాగే, శ్రీనివాసరెడ్డి భార్య మాధురి, ప్రసాద్‌రెడ్డి భార్య శ్రీలక్ష్మి, రఘురాంరెడ్డి కోడళ్లు స్వప్నిరెడ్డి, అశ్రిత, కుమారుడు అర్జున్‌రెడ్డి కూడా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. మరోపక్క రఘురాంరెడ్డి వియ్యంకుడు, హీరో వెంకటేశ్ సైతం ఖమ్మం, కొత్తగూడెంలో మంగళవారం జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సతీమణి తాండ్ర వినీలరావు సైతం నియోజకవర్గాన్ని చుట్టేస్తూ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కుమారుడు భవ్యతేజ, వారి అన్న కుమారుడు నామ సాయిరాం ప్రచారంలో పాల్గొంటున్నారు. నేడో రేపో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సతీమణి తమ్ముడు, హీరో తొట్టెంపూడి వేణు సైతం ప్రచారానికి వస్తారని చెబుతున్నారు.

ఎండను లెక్కచేయకుండా..

మండే ఎండను సైతం లెక్కచేయకుండా తమవారి గెలుపుకోసం పనిచేస్తున్నారు. ఈ వాతావరణానికి, వడగాల్పులకు అత్యవసరం ఉంటే తప్పా ఎవరూ బయటకు రావొద్దని ప్రభుత్వం ఆరెంజ్ అలెర్ట్ జారీచేసింది. అయినా తమ గెలుపు ఆనందాన్ని ఆస్వాదించడానికి.. ఐదేళ్ల పదవి కోసం అష్ట కష్టాలు, పడరాని పాట్లు పడుతున్నారు. 45 డిగ్రీలకు పైగా ఎండలు దంచికొడుతున్నా వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా తమ ప్రచారం కొనసాగిస్తున్నారు.

సంభానీ.. పీఛేముడ్!

- కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గవిబేధాలు
- ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్న మాజీ మంత్రి



మాజీ మంత్రికి వ్యతిరేకంగా కాంగ్రెస్ జెండాలతో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

సత్తుపల్లి: మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సమావేశం ప్రకటన రగడ సృష్టించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన టికెట్ రాలేదని బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన ఆయన ఇటీవల మళ్లీ హస్తం గూటికి చేరారు. ఈమేరకు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ఆయన స్థానిక నాయకత్వం అనుమతి లేకుండా ప్రెస్‌మీట్ ఎలా పెడతారంటూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగడం రాజకీయ దుమారం లేపింది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో మంగళవారం ఉదయం సంభాని ప్రెస్‌మీట్ ఉంటుందని ఆ వర్గానికి చెందిన కొర్రపాటి సాల్మన్ రాజు సోమవారం సాయంత్రం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో కాంగ్రెస్‌లోని సంభాని వ్యతిరేకవర్గం ఈ అంశంపై జిల్లా అధినాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పార్టీలో వర్గ విభేదాలను ప్రోత్సహించేందుకే సంభాని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని స్థానిక కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేయడమే కాక ఏకంగా కాకర్లపల్లి శివారులో ఆయనను అడ్డుకుంటామని భైఠాయించడం చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండగా...

కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు సంభాని పార్టీని వదిలేసి వెళ్లినా.. కష్టపడి నియోజకవర్గంలోనే కాకర్లపల్లిలో అత్యధిక మెజార్టీ తెచ్చుకున్నామని పార్టీ కార్యకర్తలు తెలిపారు. అలాంటిది కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండగా సంభాని చంద్రశేఖర్ కనీస సమాచారం ఇవ్వకుండా ప్రెస్‌మీట్ ఎలా పెడతారంటూ వారు ప్రశ్నించారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన సంభాని చంద్రశేఖర్, ఆయన అనుచరులను గ్రామ రాజకీయాల్లో రానిచ్చేది లేదంటూ సంభాని చంద్రశేఖర్ గోబ్యాక్.. గోబ్యాక్ అంటూ నినదించారు.

ప్రెస్‌మీట్ రద్దు

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి పిలుపు రావటంతో అత్యవసరంగా వెళ్లాల్సి ఉన్నందున ప్రెస్‌మీట్ రద్దు చేసుకున్నట్టు సంభాని అనుచరుడు సాల్మన్‌రాజు మంగళవారం మరో మెస్సేజ్ పంపించారు. కాగా, సంభాని హైదరాబాద్ గాంధీభవన్‌లో గతనెల 26న కాంగ్రెస్‌లో చేరారు. అయితే, ఈ పరిణామం స్థానిక కాంగ్రెస్ నాయకత్వానికి మింగుడు పడడం లేదు. సంభానితో కలిసి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వకపోగా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని ఆయన వర్గం నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, తాము ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికు మద్దతుగా మాట్లాడేందుకే ప్రెస్‌మీట్ ఏర్పాటుచేశామని చెబుతున్నా... ఎన్నికల వేళ ఈ పరిణామం ఎటు దారితీస్తుందోనని పార్టీలో చర్చనీయాంశమైంది.

బీజేపీ అభ్యర్థికే మా మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న రామనాథం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు టీడీపీ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం వెల్లడించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో టీడీపీ ఎన్డీఏతో పొత్తు కుదుర్చుకున్నందున తెలంగాణలో కూడా ఎన్డీఏకు మద్దతు ఇస్తుందని తెలిపారు. అయితే, ఇక్కడ టీడీపీ అభ్యర్థులు లేనందున ఖమ్మం బీజేపీ అభ్యర్థి వినోద్‌రావుకు అధిష్టానం నిర్ణయం మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు. పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తలు వినోద్‌రావు విజయానికి పాటుపడతారని రామనాథం తెలిపారు. నాయకులు కొండబాల కరుణాకర్, మల్లాది హనుమంతరావు, కేతినేని హరీష్, మల్లెంపాటి అప్పారావు, కాపా కృష్ణమోహన్, కనుకుంట్ల కుమార్, గుత్తా సీతయ్య, చేకూరి చలపతిరావు, ఆరెం వరలక్ష్మి, చుండూరు రాజేశ్వరి, మేడేపల్లి రాణి, కల్యాణపు లక్ష్మీపతి, ఆర్‌ఎం రామయ్య, సానబోయిన శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ గెలిస్తే రిజర్వేషన్లు మాయం

ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ మల్లేశ్వర్



మాట్లాడుతున్న మల్లేశ్వర్

ఖమ్మంమామిళ్లగూడెం: మరోమారు కేంద్రంలో బీజేపీ గెలిచి నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తే రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎస్.మల్లేశ్వర్ పేర్కొన్నారు. ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఈ ఎన్నికల్లో అంతా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల ఆర్థిక, సామాజిక సమస్యలు ఓ పక్కన, కార్పొరేట్ సంస్థల దోపిడీ మరోపక్క ఉన్న నేపథ్యాన ఆలోచించి తీర్పు ఇవ్వాలన్నారు. గత పదేళ్ల మోదీ పాలనలో ఎన్నడూ లేనంత స్థాయిలో నిరుద్యోగ సమస్య పెరగగా.. విద్యావంతులైన యువత అశాంతికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోమారు మోదీ గెలిస్తే ఇదే పరిస్థితి కొనసాగడమే కాక రిజర్వేషన్లు రద్దుచేసి రాజ్యాంగం మార్చే ప్రమాదముందని మల్లేశ్వర్ తెలిపారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో డాక్టర్ గట్టి ఎల్లయ్య, ముత్తయ్య, గజవెల్లి సత్యనారాయణ, ప్రసాద్, రత్నాకర్, విజయ్‌కుమార్, రాధా శేఖర్, సతీశ్‌కుమార్, శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత



మాట్లాడుతున్న మాలోత్ కవిత, పక్కన హరిప్రియ, దిండిగల తదితరులు

కామేపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని, అమలు కానీ హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించిన ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడకు వెళ్లినా గ్యారంటీల అమలుపై కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యాన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేకపోగా.. బీజేపీది అదే పరిస్థితి అని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ప్రజలకు వివరించి లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కవిత కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, నాయకులు దిండిగల రాజేందర్, ఆంతోటి అచ్చయ్య, వడియాల కృష్ణారెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, సామా మోహన్‌రెడ్డి, అజ్మీరా విజయలక్ష్మి, పుచ్చకాయల బాబు, శెట్టి శ్రీనివాస్, భట్టు శంకర్, అజ్మీరా రాజునాయక్, కాత్రాల రాంబాబు, నూనావత్ సూర్య, బానోత్ మంగ్యా, అజ్మీరా రాకేశ్, ఆదూరి ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు.

కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు



తాళ్లమడలో పిడుగు పడి కాలిపోతున్న కొబ్బరిచెట్టు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడి గాలివాన కురిసింది. ఈక్రమాన మండలంలోని తాళ్లమడలో నున్నా సత్యనారాయణ ఇంటి సమీపాన కొబ్బరి చెట్టుపై పిడుగు పడగా చెట్టు కాలిపోయింది.

విద్యుత్ వైరు తాకి గేదెలు మృతి

కారేపల్లి: కారేపల్లి మండలంలో ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడగా.. నేలపై తాకిన తీగలను తాకిన రెండు పాడి గేదేలు మృతి చెందాయి. బాజుమల్లాయిగూడెం సమీపాన కరెంట్ వైర్లు తెగి పడగా, పుసులూరి రాంబాబు, కొంక రాములకు చెందిన పాడి గేదెలు మేతకు వెళ్లిన సమయాన వాటిని తాకగా విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి.

గడ్డివాము దగ్ధం

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లికి చెందిన రైతు కుంచపు కృష్ణయ్య నిల్వ చేసిన వరిగడ్డి వాముకు మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. ఈ ఘటనతో సుమారు రూ.25 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

ముగ్గురిపై హత్యాయత్నం కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్: వ్యాపారి హత్యకు యత్నించారని ముగ్గురిపై ఖానాపురం హవేలీ పోలీసులు 2021లో ముగ్గురిపై నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సుజన ఈనెల 2న తీర్పు చెప్పగా.. తీర్పు ప్రతులు మంగళవారం వెలువడ్డాయి. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. భూతగాదాలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారి తుళ్లూరి శ్రీనివాసరావును హత్య చేసేందుకు రౌడీషీటర్లు, బైరు వెంకన్న, దొడ్డా హరీశ్, ధర్మవరపు సర్వేష్‌కు రూ.30వేల నగదుతో పాటు రెండు కొడవళ్లు సరఫరా చేశారని మంచుకొండకు చెందిన మందడపు సుధాకర్, మందడపు మాధవరావు, యల్లపల్లి హన్మంతరావు సహా ఆరుగురిపై 2021 ఆగస్టు 8న కేసు నమోదైంది. హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, భారత ఆయుధ చట్టం అభియోగాల కింద కేసు దాఖలు చేయగా, ఖమ్మం అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. అయితే, తమపై తప్పుడు అభియోగాలతో కేసు నమోదు చేశారని సుధాకర్, మాధవరావు, హన్మంతరావు 2022లో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కేసును పరిశీలించిన హైకోర్టు జడ్జి కె.సుజన గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుల ఆధారంగా నిందితులు ప్రత్యక్ష చర్యలకు పాల్పడినట్లు అభియోగాలు లేనందున కేసు కొట్టివేశారు. కాగా, నిందితుల తరఫున హైకోర్టులో న్యాయవాది సి.చరణ్‌రెడ్డి, ఖమ్మం కోర్టులో న్యాయవాది కిలారు బాబ్జీ వాదించారు. కాగా, ఈ కేసు 2021లో రాజకీయంగా జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది.

నక్సలైట్లమని నకిలీ పిస్టల్‌తో బెదిరింపులు

ఖమ్మంఅర్బన్: నక్సలైట్లమని.. తమకు డబ్బు ఇవ్వాలని ఓ వ్యాపారిని నకిలీ పిస్టల్‌తో బెదిరించిన దంపతులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఖమ్మం 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యాపారి ఇంట్లోకి ఈనెల 1న మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు చొరబడి తమను నక్సలైట్లుగా చెబుతూ రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే చంపేస్తామని నకిలీ పిస్టల్‌తో బెదిరించడంతో ఆయన రూ.5 వేలు ఇవ్వగా తీసుకుని వెళ్లిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో మంగళవారం శ్రీశ్రీ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు అలియాస్ ఎస్‌వీ.రెడ్డి, ఆయన భార్య రాయల లతగా తేలింది. కూరగాయల వ్యాపారం, టైలరింగ్ చేసే వీరిద్దరే సులువుగా డబ్బు సంపాదించాలని సదరు వ్యాపారిని బెదిరించినట్లు నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, గతంలో వీరు 12 కేసుల్లో నిందుతులుగా ఉండగా, రూ.3 వేలు నగదు, బొమ్మ పిస్టల్ స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

– మరో ఇద్దరికి గాయాలు



విఘ్నేష్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ వైఎస్సార్ నగర్ సమీపాన మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కామేపల్లి మండల తాళ్లగూడెంకు చెందిన కృష్ణ ఆటో నడిపిస్తూ వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్నాడు. ఆయన కుమారుడు విఘ్నేష్ ఇటీవలే 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నాడు. ఆయన మంగళవారం కొణిజర్ల మండలం మునగాలకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా వైఎస్సార్ కాలనీకి చెందిన భాస్కర్, ప్రశాంత్ ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చేక్రమాన రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో విఘ్నేష్ అక్కడికక్కడే మృతి చెందగా భాస్కర్, ప్రశాంత్ గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తల్లాడ మండలంలో ఆటోడ్రైవర్...



తేళ్లూరి కృష్ణ (ఫైల్)

తల్లాడ: మండలంలోని నూతనకల్–మల్సూర్‌తండా మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం ... కల్లూరు మండలం శాంతినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ తేళ్లూరి కృష్ణ(62) మిట్టపల్లి నుంచి కల్లూరు వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో ఆటో నుంచి కింద పడిన ఆయనపై నుంచి గుర్తుతెలియని వెళ్లడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

పల్లిపాడు వద్ద భద్రాద్రి జిల్లా వాసి..

కొణిజర్ల: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై జి.శంకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వైరా వైపు నుండి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని పల్లిపాడు వద్ద ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం ఆయన భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన కొరడాల రామకృష్ణ(40)గా గుర్తించారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండడంతో సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు వాహనాలు నిలిచిపోగా, కొణిజర్ల, వైరా ఎస్సైలు చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు.

వడదెబ్బతో వృద్ధుడు...

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన మల్లు వెంకటి(55) వడదెబ్బతో మంగళవారం మృతి చెందాడు. ఎండ తీవ్రతతో వడదెబ్బ బారిన పడిన ఆయన మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి(40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం–మల్లెమడుగు ప్రాంతంలో రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి దాటాక ఆత్మహత్య చేసుకున్న పోలీసులకు సమాచారం అందింది. దీంతో అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
బుధవారం ॥ 8-5-2024

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!


ఇందు గుర్జార్

''సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50–100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసీఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెయినింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరుచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే'' అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది. 'అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి' 'ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది' ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు. వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది. 'ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ' అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత 'గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్'లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. 'ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి 'ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?' అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను' అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. 'అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు' అంటుంది రమ. 'అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టే వారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి' అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

'నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను' అని ముగించింది రమా పద్మనాభన్.

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల 'ఉద్యోగమే సర్వస్వం' 'ఉద్యోగం దొరికితే చాలు' అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. 'ఉద్యోగం ఎందుకు చేయాలి?' నుంచి 'చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి' వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

యూత్ పల్స్

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

'డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్' అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు 'ఉద్యోగ మార్పు'నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

'పని ఒత్తిడి చచ్చినట్లు భరించాల్సిందే' అని రాజీ పడడం కంటే 'జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను' అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ 'ఇది కాదు జీవితం' అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. 'నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది' అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. 'ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి' అంటుంది సారా.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ 'టిగెల్' చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. 'టిగెల్' స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. 'చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అనువ కక్కర్.



బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

'ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది' అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

'ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది' అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో 'గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్' వచ్చాయి. 'గ్యాప్ ఎక్స్' పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

'యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు' అంటున్నాడు ఢిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

• సోషల్ యాక్టివిస్ట్ • ఫ్యాషన్ డిజైనర్ • రైటర్ • మోటివేషనల్ స్పీకర్

అదర్ సైడ్


కరీనా కపూర్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ 'గ్లోబస్'తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన 'డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్' పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. 'ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా' పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా భీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి 'ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్' డాక్యుమెంటరీపై పనిచేసింది. ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన 'గర్ల్ రైజింగ్' అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–వోవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవీ ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగుర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. ఛత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. 'నవజాత శిశువులను కాపాడుకుందాం' పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి 'ఎవ్రీ చైల్డ్ అలైవ్' అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...'నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను' అంటుంది కరీనా కపూర్.

'కరీనా కపూర్ ఎక్స్‌లెంట్ కమ్యూనికేటర్' అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 'నేను ఎలా సాధించానంటే'లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. 'ఇదీ ఒక విజయమేనా!' అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.

– కరీనా కపూర్